# సమయస్ఫూర్తి

–కాకాని కమల

కాకాని కమల
ఫ్లాట్ నం. 15, బ్యాంక్ కాలనీ,
లలితా నగర్, ఉస్మానియా రైల్వే స్టేషన్,
హైదరాబాద్ - 44.

రాత్రి సమయం ఏడుగంటలు దాటుతోంది.

క్రమంగా చీకటి చిక్కబడుతోంది.

ఇండస్ట్రియల్ ఏరియా... సిటీ అవుట్‌కట్స్ కావటంతో ఆ చీకటి మరింత చిక్కగా ఉంది.

రోడ్డువారగా బస్సు స్టాపులో నిల్చున్న దివ్య దీనంగా ఆందోళనగా ఉంది.



దాదాపు రెండు గంటలనుంచి ఒంటరిగా బయట బిక్కు బిక్కు మంటు నిల్చోనుంది.

కాని ఒక్కసిటీ బస్సు రాలేదు.

మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో సిటి బస్సులో ఈ ప్రాంతానికొచ్చింది.

అప్పుడు సిటి బస్సులన్నీ బాగానే నడుస్తున్నాయి.

కాని మూడుగంటల ప్రాంతంలో సికింద్రాబాదు రెంక్షన్‌లో ఒక సిటి బస్సు - ఆటో గుద్దుకొని ఇద్దరు డ్రైవర్లకి మాటా మాటా పెరిగి కొట్లాటకి దారి తీసిందట. ఆటో రాంగ్ రూట్‌లో వస్తుందని బస్సు డ్రైవరూ, డ్రైవర్ హారన్ చెయ్యలేదని, తను రూటులోనే ఉన్నానని ఆటోవాలా, వారిద్దర్నీ పోలీసులు అరెస్ట్ చేశారట.

అంతే.

ఆటో డ్రైవర్లూ, బస్సు డ్రైవర్లూ తమకి న్యాయం జరిపించాలని ఒకేసారి ఇరుపక్షాలవారూ సమ్మె ప్రకటించారట. లంచ్ తరువాత ఆటోలు బస్సులు తిరగటం మానేశాయట. ఈ సంగతి తెలిసిన దివ్య ఐదుగంటల ప్రాంతంలో అలసటగా బస్సు స్టాపుకి వచ్చింది గంట అయినా ఒక్క బస్సు రాలేదు.

దారంట పోతున్న సైకిలిస్ట్ ఎవరో బస్సులు 'బంద్' అని చావు కబురు చక్కగా చెప్పాడు.

దివ్యకి దిక్కు తోచలేదు.

సిటి బస్సులు లేవూ, ఆటోలు లేవూ ఇంటికి ఎలా వెళ్ళాలి?

గుండెల్లో రాయి పడింది.

అయినా ఏ సిటీబస్సో రాకపోతుందా అన్న ఆశతో అలాగే నిల్చుంది. చూస్తూ ఉండగానే ఎనిమిది అయ్యింది రోడ్డుమీద జనసంచారం లేదు. బస్సు స్టాపులో దివ్య ఒక్కర్తే నిల్చుంది.

దివ్యకి రెండు కిలోమీటర్ల దూరంలో ఇండస్ట్రీస్ కనిపిస్తున్నాయి. దివ్య గుండె దడదడ మంటోంది.

అయినా ధైర్యం తెచ్చుకుంటోంది.

ఉండుండి కొంచెం బస్సులూ, చిన్నకార్లూ వేగంగా దూసుకుని పోతున్నాయి.

ఎవర్నయినా లిఫ్టు అడగాలి.

అంతకంటే వేరే మార్గం లేదు.

రోడ్డు మీదికొచ్చి కంపెనీ బస్సులకి చెయ్యి ఊపింది.

అసలు డ్రైవరు తనని గమనించనట్లుంది. వేగంగా దూసుకుని పోతున్నాయి.

చిన్నకార్లు ఏవో పోతూనే ఉన్నాయి.

వాటిని ఆపి ఎక్కాలంటే భయంగా ఉంది.

కాని అంతకంటే వేరే మార్గం లేదు.

ఇక్కడ తనకి ఆలస్యం అయిన కొద్దీ ఇంటి దగ్గర కంగారు పడతారు, తనకీ ప్రమాదమే.

ఆలోచిస్తూనే తలెత్తి రోడ్డు చివరగా అటూ ఇటూ చూసింది.

దూరంగా ఏదో చిన్నకారు వేగంగా దూసుకుని వస్తోంది. కారు హెడ్‌లైటు రాను రాను దగ్గర అవుతోంది.

ఏమైనా జరగనీ అనుకుంటూ గబగబా బస్సుస్టాపు లోంచి రోడ్డుమీదికి వచ్చి అపమన్నట్లు వేగంగా చెయ్యి ఊపింది.

ఆమె అదృష్టమో ఏమో కారు అల్లంత దూరం నుంచే స్లో అవుతూ ఆమె దగ్గరగా వచ్చి ఆగింది.

డ్రైవింగ్ సీట్లో ఉన్నయువకుడు విండోలోంచి తల బయటికి పెట్టి చిరునవ్వుతో ఆమెకేసి చూస్తూ "వాట్ కెన్ ఐ డు ఫర్ యు" అన్నాడు

"సిటీకెళ్ళాలి! లిఫ్ట్ కావాలి" అంది.

"విత్ ప్లజర్" అంటూ ఫ్రంట్ డోర్ తెరిచాడు.

"హమ్మయ్య బ్రతికానురా బాబూ!" అనుకుంటు గబగబా వచ్చి కారులో అతని ప్రక్కన కూర్చుంది.

సీటులో సర్దుకుని కూర్చుంటు యధాలాపంగా వెనక్కి తల తిప్పిన దివ్య గుండె ఆగినంత పని అయ్యింది.

వెనక సీట్లో ఎవరో ఇద్దరు మగవాళ్ళు ఉన్నారు.

వాళ్ళందరూ బాగా తాగినట్లుంది. కారులోకి ఎక్కగానే ఒకవిధమైన లిక్కరు వాసన ఘాటుగా నాసికా పుటాల్ని తాకింది. ఇంతలో డ్రైవింగ్ సీట్లో ఉన్న యువకుడు ఒక చేత్తో డ్రైవింగ్ చేస్తూనే మరో చేతిని దివ్య కూర్చున్న సీటు వెనకగా చాపాడు.

అతని మునివేళ్ళు సుతారంగా దివ్యని తాకు తున్నాయి. సన్నగా ఈలపాట మొదలెట్టాడు.

అయినా దివ్య బెదరనట్లు గుండె ధైర్యం తెచ్చు కుంటూ నిబ్బరంగా అలాగే కూర్చుని రోడ్డు మీదకి చూస్తూ ఉండి పోయింది.

"బేబీ! నీ పేరేంటి?" అన్నాడు అతను.

"దివ్య."

"దివ్య. దివ్యంగా ఉంది. గుడ్ నేమ్."

"అన్నట్లు ఎక్కడి కెళ్ళాలి?"

దివ్య అడ్రస్ చెప్పింది.

అతను కాస్త ఉలిక్కిపడినట్లు గభాల్న ఆమె వెనకాల నుంచి చేతిని తీసేసి తన సీట్లో సర్దుకుని కూర్చొని రెండు చేతులూ డ్రైవింగ్ వీల్ మీద వేశాడు. ఈలపాట ఆగి పోయింది.

"జస్టిస్ పరమేశ్వరీ దేవి ఇంటికా?" అన్నాడు ఆశ్చర్యాన్ని అణచుకుంటూ..."

"అవును..." అంది.

జస్టిస్ పరమేశ్వరి దేవి ఇల్లు అతనికి తెలుసు. రెండుమూడుసార్లు వెళ్ళాడుకూడా. ఇప్పుడు ఈ అమ్మాయి చెప్పిన అడ్రస్ ఆవిడదే.

కాని... అతను ఆమెకేసి చూస్తూ "జస్టిస్ పరమేశ్వరీ దేవి మీ అమ్మగారా..." అన్నాడు ఉత్సుకతగా.

"కాదు. ఆవిడ మా ఆంటి. మా నాన్నగారి సిస్టర్. నేను ఆవిడ దగ్గర ఉండి చదువుకుంటున్నాను. ఇక్కడ ఒక కంపెనీలో నాఫ్రెండు పని చేస్తోంది. ఈ మధ్య వాళ్ళ ఫాదర్ చనిపోయారని తెల్సింది. అందుకని చూట్టానికి వచ్చాను. నేను వచ్చినప్పుడు బస్సులు బాగానే తిరుగు తున్నాయి. కాని లంచ్ తరువాత ఆటోలు బస్సులు స్ట్రైకట. నాకు తెలీదు. రెండు గంటలనుంచి బస్సుకోసం నిలబడ్డాను. చీకటి అయిపోతోంది. అందుకే మీ కారు... లిఫ్టు..."

"ఓ.కే. ఓ.కే. ఇట్సాల్‌రైట్. మీకీ సహాయం చెయ్యటం నాకెంతో ఆనందంగా ఉంది." అన్నాడు అతను మర్యాదగా.

కారు మునపటి కంటే వేగం హెచ్చింది.

కారులో ఒక రకమైన టెన్షన్. ఒక కలక్టర్‌ని కారులో తీసుకుపోతున్నట్లు ముగ్గురు మగవాళ్ళూ ఎలర్ట్‌గా కూర్చు న్నారు.

అరగంటలో కారు సిటీలోకి ప్రవేశించింది.

మరొక పావుగంటలో జస్టిస్ పరమేశ్వరి దేవి ఇంటి ముంగటకొచ్చి నెమ్మదిగా స్లో అయ్యింది.

దివ్యకి ఊపిరి వచ్చింది. బిగుసుకున్న శరీరం నిటారుగా అయ్యింది. చుట్టూ విశాలమైన కాంపౌండ్. కారు పోవటానికి వీలుగా పెద్ద గేటు.

పూలతీగలూ, లతలూ పాకిన పోర్టికోలో అందమైన బిల్డింగ్... జస్టిస్ పరమేశ్వరీదేవి అన్న నేమ్‌ప్లేట్ లైట్ వెలుగులో జిగజిగ మెరిస్తోంది. ఇన్-అవుట్ అన్నచోట 'ఇన్' కనిపిస్తోంది. పోర్టికోలో ఆవిడ కారుకూడా ఉంది. అంటే ఆవిడ ఇంట్లోనే ఉన్నారన్నమాట.

జస్టిస్ పరమేశ్వరీ దేవి ఇంటికి పదిగజాల దూరంలో కారు ఆపు చేశాడు ఆ యువకుడు.

దివ్య తేలికపడ్డ మనస్సుతో హుషారుగా కారు దిగింది.


"థ్యాంక్స్" అంటూ డ్రైవింగ్ సీట్లో ఉన్న యువ కుడికి దివ్య. కృతజ్ఞతలు చెప్పబోయేంతలో అతను చాలా రిక్వెస్టింగ్‌గా "మేడమ్ ఒన్ మినిట్" అంటూ జేబులోంచి అతని విజిటింగ్ కార్డ్ తీశాడు.

"...?" కొంచెం విస్తుపోతూ ఏమిటి? అన్నట్లు చూసింది దివ్య.

"మేడమ్ ఇఫ్ యు డోంట్‌మైండ్. ఒన్ రిక్వెస్ట్.

"ఎస్..."

"నా పేరు సుధీర్. బాలానగర్‌లో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ నాది. ఈ కార్డుమీద నా డిటేల్సు ఉన్నాయి ఆరునెల్ల క్రితం మా కంపెనీలో పనిచేసే స్వీపరు కూతురు మా కంపెనీలో అనుమానాస్పద పరిస్థితిలో మరణించింది. ఆ అమ్మాయిది ఆత్మహత్య కానీ, సహజ మరణం కానే




డి. శ్రీధర్, డి. కొండాపురం, రాయదుర్గం (తాలూకా), అనంతపురం (జిల్లా) - 515865

కాదనీ, హత్య అనీ, గ్యాంగ్ రేప్ అయ్యిందనీ పోలీసులు కేసు పుటప్ చేశారు. అయితే ఆ కంపెనీ ప్రొప్రయిటర్‌గా అందులో నాకూ భాగం ఉందని ఆరోపణ. కాని నిజానికి నాకేం సంబంధం లేదు. ఆ సమయంలో నేను బిజినెస్ టూర్‌లో ఉన్నాను. ప్రస్తుతం కేసు కోర్టులో ఉంది. మీరెలాగైనా మీ ఆంటీకి చెప్పి నన్నీ కష్టం నుంచి బైట పడవేస్తే ఆవిడ ఋణం ఉంచుకోను. ఈ కేసు జస్టిస్ పరమేశ్వరిదేవిగారి దగ్గరకే వచ్చింది. ఈ విషయం గురించి ఆవిడతో పర్సనల్‌గా మాట్లాడాలని ఒకటి రెండుసార్లు ఇంటికి కూడా వచ్చాను. కాని ఆవిడ ఇంటర్వ్యూ ఇవ్వలేదు. మీరు దయచేసి ఎలాగైనా నాకీ స...హా..!!

"...." ఏదో ఆలోచిస్తున్నట్టు నెమ్మదిగా తలెత్తి, లైటు వెలుగులో రెండు నిమిషాలు అతని కేసి చూస్తూ "ఓ.కే. చెప్పి చూస్తాను. కాని అత్తయ్య ఎవ్వరిమాటా వినరు. పైగా కోర్టు విషయాల్లో మేం కలుగచేసుకోం. అయినా చెప్పి చూస్తాను."

"థ్యాంక్యూ మేడమ్. మీరు శ్రమ అనుకోకపోతే ఇంకో చిన్న రిక్వెస్ట్."

"చెప్పండి."

"మీ ఆంటి ఏమన్నదీ మీరు దయచేసి నాకు ఫోన్ చేసి చెప్పండి. ఆవిడ చెప్పినదాన్ని బట్టి నేను అప్రోచ్ అవుతా. నన్ను ఈ కోర్టు కేసునుంచి బయటపడవేస్తే చాలు. ఆవిడ ఋణం ఉంచుకోనని చెప్పండి. నేను వచ్చి స్వయంగా మాట్లాడతాను."

"సరే"

"థ్యాంక్యూ మేడమ్. నా అదృష్ట దేవత ఈరోజు మీ రూపంలో నా కారు ఎక్కిందను కుంటాను. మీ ఫోన్ కోసం ఎదురు చూస్తూ ఉంటాను. ఎలాగైనా మీరు నాకీ సాయంచే..."

"ఓ.కే. ఆంటికి చెప్పి మీ విజిటింగ్‌కార్డు ఇస్తాను."

"థ్యాంక్యూ.. బై..

కారు వెళ్ళి పోయింది.

"హమ్మయ్య" గండం గడిచినట్లు దివ్యతేలిగ్గా ఊపిరి తీసుకుంది.

చేతిలోని విజిటింగ్ కార్డుని రెండు ముక్కలుగా చింపి రోడ్డు మీదికి గిరాటేసింది.

తనని ఆపదనించి కాపాడిన దేవత గుడికేసి భక్తిగా చూసినట్లు జస్టిస్ పర మేశ్వరీదేవి ఇంటికేసి ఒకసారి చూసి పక్కనే ఉన్న గల్లీ లోకి పరుగులాంటి నడకతో వేగంగా అడుగులు వేసింది.

దూరంగా సగం కప్పుకుంగిన పెంకుటిల్లూ, అందులో వెలుగుతున్న దీపం కనిపించగానే దివ్యకి ప్రాణం లేచివచ్చింది.

తన తండ్రి మామూలు గుమస్తా అనీ, తన తల్లి ఇరుగు పొరుగులకి బట్టలు కుడుతుందనీ, పెళ్ళి కావల్సిన ముగ్గురు అక్కాచెల్లెళ్ళలో తను మూడవదనీ, ఒక ఉద్యోగం ఇంటర్వ్యూకి తను బాలానగర్ వచ్చిందనీ, కేవలం తమ వీధి చివర ఉండే జస్టిస్ పరమేశ్వరీదేవి పేరు, అప్పటికప్పుడు సమయస్ఫూర్తితో తను ఆపద్ధర్మంగా వాడుకుందనీ తెలిస్తే ఆ సుధీర్ తనని ఇంత గౌరవంగా ఇంటి దగ్గరకి తెచ్చి దింపేవాడా? అతని కంపెనీ స్వీపరు కూతురికి పట్టిన గతే ఈపాటికి తనకీ పట్టి ఉండేది. డబ్బు ముడుపు కట్టి ఇప్పటిలాగే కేసుమాఫీ చేయించుకుందుకు ప్రయత్నించి ఉండేవాడు.

ఇలాంటి వెధవల జాతకాలు బాగా తెలుసున్నది కనకనే జస్టిస్ పరమేశ్వరీదేవి ఈ సుధీర్‌కి పర్సనల్ ఇంటర్వ్యూ ఇచ్చి ఉండదు.

చేపకి ఈదటం పిట్టకి ఎగరటం ఎవరు నేర్పించారు?

మారుతున్నకాలాన్ని బట్టి ఆడపిల్ల తనని తాను రక్షించుకోవటం నేర్చుకోవాలి. వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్ళి చెయ్యమనటం పాతకాలం సామెత. కానీ ఇప్పుడు లక్ష అబద్ధాలాడైనా ఆడపిల్ల తనని తాను రక్షించుకోవాలి అనటం కొత్తకాలం సామెత.

ఆడపిల్లకి పెద్ద చదువులు, ఉద్యోగాలు ఎందుకని, ఎంతచదివినా ఆడపిల్ల పిల్లల్ని కని వంటింటికి బానిసత్వం చెయ్యాలని వాదించే బామ్మకి తను ఇంతరాత్రి వేళ ఒక స్త్రీ పేరు చెప్పుకుని తనని తాను ఎలా రక్షించుకుందీ, తన తెలివితేటల్తో తనని ఎలా కాపాడుకుందీ చెప్పాలి.


హుషారుగా తన ఇంటి తడికెల గేటు తెరుచుకుని "బామ్మా" అంటూ ఇంట్లోకి పరిగెత్తింది దివ్య.

"దివ్యమైన పేరుగల బేబీ దివ్య!"

## గమ్యం

"ప్రయాణము" చేస్తున్నాననే
ధ్యాసైనా లేకుండానే ...
"గమ్యం చేరానా ?" అని విభ్రాంతి పొందాను -
అయితే - అది గమ్యం కాదు -
మొదటి మజిలీ ' అని తెలిసి... .
నవ్వాలో, ఏడవాలో తెలీకుండానే ...
పయనం సాగించాను -
బడలికతో అలసిన మనసు
సేద తీరిన చోట...
'ఇదే గమ్యమని భావించి...
గూడు కట్టబోయాను -
అయితే - నా భావేన ... భ్రమయనీ-
'అది రెండవ మజిలీ 'అని తెలిసి...
ఆచోటు వదిలి ఎగిరే శక్తి లేక ..
రెక్కలు తెగి కూలిపోయాను-
ఈ గువ్వను తన దరిచేర్చుకోవాలని...
కోరుకున్న ఓ చల్లని ఒడి...
ఇదే నీ గమ్యమని- నను చేరిచెబితే ...
విభ్రాంతి పొందాను...
అయితే (ఆ ఒడిలో ...నేను...) -
'నీ చెంత చేరలేను -ఇదే నా చివరి మజిలీ' అని
తెలిసి ...
.నా ప్రాణవాయువులనంతంలో
కలిసే క్షణాలకై...వేచి చూడసాగాను"

శ్రీమతి జ్యోతిర్మయి




కే.శ్రీనివాసులు,ఇంటి నెం.20-375,వెంకన్న వీధి,ఆదోని-518 301 (ఏ.పి.)